సాక్షి
తూర్పుగోదావరి

శనివారం, 20, సెప్టెంబర్, 2025



ఇల్లాలి ఆరోగ్యం.. ఇల్లంతా ఆనందం..

మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.



వీఆర్ఏల పోరుబాట

రెవెన్యూ వ్యవస్థలో అత్యంత కీలకంగా పని చేసే గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట పట్టారు.

II లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం రాత్రి 5,08,878 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,700, సెంట్రల్ 1,400, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ఈ జ్వరాలు సాధారణమైనవే..



డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రస్తుతం ప్రబలుతున్న జ్వరాలు సాధారణమైనవేనని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని, తగిన వైద్య పరీక్షలు చేపడుతున్నామని వివరించారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తూ, కేసులు నమోదైన ఇళ్లకు చుట్టువక్కల 50 నివాసాల్లో కూడా పరిశీలన చేస్తున్నారని తెలిపారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, ఇండోర్ స్పేస్ స్ప్రే వంటి చర్యలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, పురపాలక సంస్థల సహకారంతో లార్వా నిర్మూలన కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రై డే' కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వెక్టర్ కంట్రోల్ హైజీన్ యాప్ ద్వారా ఇంటింటి సర్వేలో నీటి నిల్వలు గుర్తించగానే పంచాయతీ లేదా పట్టణ కార్యదర్శులకు సమాచారం ఇచ్చి, వాటిని తొలగించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలోని 33 రూరల్ పీహెచ్‌సీలు, 15 అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో జ్వరాలపై సర్వే చేస్తున్నామన్నారు. గుర్తించిన వారందరికీ ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అనుమానాస్పద కేసులను రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు పంపించి, మాక్ ఎలీసా పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 19 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని, మలేరియా కేసులేవీ లేవని డాక్టర్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతూంటే వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఐటీఐలో నాలుగో విడత ప్రవేశాలు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్మీడియెట్ ఫెయిలైన అభ్యర్థుల నుంచి ఐటీఐలలో ప్రవేశానికి నాలుగో విడత అడ్మిషన్లు నిర్వహించనున్నారు. దీనికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ అన్ని ధ్రువపత్రాలతో 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 27వ తేదీ రాత్రి 11 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకూ మధ్యాహ్నం 2 గంటల వరకూ ధవళేశ్వరంలోని జిల్లా ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్ కాపీలతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించాలని సునీల్ కుమార్ తెలిపారు.

2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేయాలి



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు రాజమండ్రి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. రెండు రోజుల పాటు పెన్‌డౌన్ చేయనున్నారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, రాజమహేంద్రవరం అధ్యక్షుడు కోలా రామచంద్రరావు మాట్లాడుతూ, 2.0 రిజిస్ట్రేషన్ విధానం వల్ల ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ఈ విధానంలో ఓటీపీలు ప్రవేశపెట్టారని, వాటిని చెప్పేందుకు ప్రజలు సంకోచిస్తున్నారని అన్నారు. ఆటో మ్యుటేషన్ సిస్టం మంచిదే అయినప్పటికీ శాఖ అధికారుల సమన్వయ లోపం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పీడీఈ విధానానికి తమ వ్యతిరేకం కాదని, అందులో లోపాలను సరిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి దస్తావేజు లేఖర్ల సంఘం కార్యదర్శి బేరి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాపుల వేలం.. రూ.4.58 కోట్ల ఆదాయం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రెండేళ్ల కాలపరిమితికి (2025–27) గాను వివిధ షాపులకు శుక్రవారం వేలం నిర్వహించారు. దీని ద్వారా దేవస్థానానికి రూ.4.58 కోట్ల ఆదాయం సమకూరింది.



ప్లకార్డులతో జక్కంపూడి విజయలక్ష్మి నిరసన



చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి బయలుదేరిన మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డు మీద ధర్నా చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

ప్రైవేటుపై జనాగ్రహం

- హోరెత్తిన 'చలో మెడికల్ కాలేజీ'
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై ఎగసిన నిరసన
- కదం తొక్కిన ప్రజానీకం
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు, అడ్డగింపులు
- నిరసనగా రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు
- కూటమి సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తిన నేతలు





ఆందోళనను అడ్డుకోవడంతో రోడ్డు మీద పడుకుని నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి వేణు, జక్కంపూడి గణేష్ తదితరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ యువత, విద్యార్థులతో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం రాజమహేంద్రవరంలో కదం తొక్కాయి. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యాన 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ప్రకాష్ నగర్‌లోని పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసం నుంచి వైద్య కళాశాలకు బయలుదేరిన యువత, విద్యార్థి, వైఎస్సార్ సీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని, వెళ్లేందుకు అనుమతి లేదని వాదించారు. అక్కడ పోలీసులు భారీ స్థాయిలో మోహరించారు. అక్కడి నుంచి కదలకుండా అష్టదిగ్బంధనం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, వైఎస్సార్ సీపీ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అయినప్పటికీ పోలీసులు స్పందించలేదు. ఉదయం నుంచే రాజా ఇంటి సమీపంలోని జంక్షన్లు, క్వారీ మార్కెట్ జంక్షన్, వైద్య కళాశాల సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. కళాశాలకు వెళ్తున్న వారిపై ఆంక్షలు విధించారు. అక్కడకు వెళ్లేందుకు వీలు లేదంటూ అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. నేతల ఇళ్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి మరీ బయటకు రాకుండా నిలువరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పోలీసులు ససేమిరా అంటూ భీష్మించారు. మండల, నియోజకవర్గ స్థాయి కార్యకర్తలెవ్వరూ రాకుండా అడ్డుకున్నారు. కొందరు నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. కనీసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సైతం అనుమతించని కూటమి ప్రభుత్వం తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యం బతికుందా అనే అనుమానం కలుగుతోందని వైఎస్సార్ సీపీ శ్రేణులు విమర్శించారు.

పోలీసుల తీరుపై ఆగ్రహించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు, యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు రోడ్డు పైనే పడుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా



ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



మార్గాని భరత్‌రామ్‌ను ఆయన ఇంటి వద్ద అడ్డుకున్న పోలీసులు

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా వారు ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. శాంతియుతంగా నిరసన తెలుపుతూంటే నిరాకరించడమే మిటని నిలదీశారు. గంటల తరబడి రోడ్డు పైనే బైఠాయించారు. వైఎస్సార్ సీపీ ఆందోళనను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న పోలీసులు పార్టీ నేతలను అక్కడి నుంచి బలవంతంగా లాగేశారు. చలో మెడికల్ కాలేజీ ఆందోళనలో మాజీ మంత్రి తానేటి వనిత, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంతమని రమేష్, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంగాడి సత్యప్రియ, నందెపు శ్రీనివాస్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన నినాదాలు

చలో మెడికల్ కాలేజీ నిరసనకు బయలుదేరుతున్న మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఆయన నివాసానికి ముందుగానే చేరుకుని నిలువరించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రాష్ట్ర కార్యదర్శి చందన నాగేశ్వర్, పార్టీ శ్రేణులతో భరత్‌రామ్ ముందుకు కదిలే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, కళాశాలకు వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పారు. దీంతో, చంద్రబాబు నిరంకుశ వైఖరి నశించాలంటూ ఆందోళనకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ర్యాలీని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ అక్కడే బైఠాయించారు. వారిని పోలీసులు బలవంతంగా లాగేశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కాలేజీలే లేవన్నారు.. పరీక్షలు ఎలా జరుగుతున్నాయి?



మాజీ సీఎం జగన్ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయలేదని కూటమి నేతలు చెప్పారు. మా ఆందోళనకు మాత్రం అనుమతి లేదంటున్నారు. ఎందుకని అడిగితే కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయంటున్నారు. కాలేజీలే లేనప్పుడు పరీక్షలు ఎలా జరుగుతాయో కూటమి ప్రభుత్వానికే తెలియాలి. రాజమహేంద్రవరం వైద్య కళాశాలలో ప్రస్తుతం రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ప్రభుత్వం అంటే ప్రజాధనాన్ని రక్షించాలి తప్ప.. ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోం. ప్రజాప్రయోజనాల కోసం ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారు.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

వైఎస్ జగన్ వల్లే 17 మెడికల్ కళాశాలలు



ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చాం. కళాశాలలు ప్రారంభమైనా కాలేదంటూ మంత్రులుగా ఉన్న వారు సెల్ఫీలు దిగడం దుర్మార్గం. అమరావతి గ్రాఫిక్స్‌లా ప్రస్తుతం గ్రాఫిక్స్ చూపుతూ మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. కళాశాలలు చూసేందుకు వెళ్తే అడ్డుకుంటున్నారు. అక్కడకు వెళ్తే నిజాలు బయటపడతాయన్న భయంతోనే పోలీసులతో నిలువరిస్తున్నారు. అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే ధోరణి మానాలి.

– తానేటి వనిత, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్

ప్రైవేటుకు లాభం చేకూర్చేందుకే



ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు కట్టబెట్టి, వారికి లాభం చేకూర్చేందుకు టీడీపీ ప్రభుత్వం అర్రులు చాస్తోంది. పేదలకు వైద్యను విద్య చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన వైద్య కళాశాలలను ఇందులో భాగంగానే ప్రైవేటు పరం చేస్తోంది. ఇది మంచి పద్ధతి కాదు. టీడీపీ నేతల జేబుల్లో డబ్బులు వేసుకునేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

– జక్కంపూడి గణేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్



చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లను అడ్డుకుంటున్న పోలీసులు



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డు పైనే ధర్నా చేస్తున్న చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి గణేష్

ప్రైవేటీకరణను ఉపసంహరించాలి



మాజీ సీఎం జగన్ సదాశయంతో స్థాపించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం తగదు. తక్షణం ప్రైవేటీకరణను విరమించుకోవాలి. రాజమహేంద్రవరం కాలేజీ 150 సీట్లతో 2023 నుంచి నడుస్తోంది. కూటమి ప్రభుత్వం మాత్రం కళాశాలలే ప్రారంభం కాలేదనడం దారుణం. ఈ కళాశాలను ఒకసారి సందర్శిస్తే అన్ని విషయాలూ తెలుస్తాయి.

– డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి

పీపీపీ విధానాన్ని అడ్డుకుంటాం



పీపీపీ విధానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడాన్ని ఎంత దూరం వెళ్లయినా అడ్డుకుంటాం. ఒకవేళ ప్రైవేటుకు కట్టబెడితే మా ప్రభుత్వం వచ్చాక రద్దు చేస్తాం. పేద ప్రజలకు వైద్యం అందకుండా, వాళ్లను చదువుకోనివ్వకుండా చేయడం దారుణం. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడం శోచనీయం. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తూ, మరోపక్క ఆరోగ్యశ్రీ కొనసాగకుండా చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదల పరిస్థితేమిటి? పీపీపీ విధానం రద్దు చేయాలి. ఆరోగ్యశ్రీ బిల్లులు వెంటనే చెల్లించాలి.

– మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ప్రై'వేటు' దారుణం



అందని ద్రాక్షలా ఉన్న వైద్య విద్యను గత ప్రభుత్వ హయాంలో అందే ద్రాక్షలా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. వందేళ్లలో కేవలం 12 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే.. ఐదేళ్లలోనే 17 కాలేజీలకు అనుమతులిచ్చి, ఐదింటిని ప్రారంభించారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు కట్టబెట్టడం దారుణం. ఈ నిర్ణయం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్ ఆశయ సాధనకు తూట్లు పొడిచేలా ఉంది. ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

– తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్

పెత్తందార్లకే చంద్రబాబు సపోర్ట్



సీఎం చంద్రబాబు సపోర్ట్ ఎప్పుడూ పెత్తందార్లకే ఉంటుంది. ఇందులో భాగంగానే మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు కట్టబెడుతున్నారు. కూటమి నిర్ణయంతో పేదలకు వైద్య విద్య అభ్యసించే అవకాశం ఉండదు. పేదలకు వైద్యం కూడా అందదు. ప్రైవేటీకరణపై వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తుంది. కూటమి నేతలకు దమ్ముంటే మెడికల్ కళాశాలల వద్దకు వచ్చి ఫొటోలు తీసుకోవాలి. ప్రభుత్వం చేసిన అప్పులో కొంత భాగం ఖర్చు చేస్తే మిగిలిన కళాశాలలు కూడా పూర్తవుతాయి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్

సస్పెండైన ఉద్యోగులపై త్వరితగతిన విచారణలు

- కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశం
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): క్రమశిక్షణ లోపం తదితర కారణాలతో సస్పెండైన ఉద్యోగులపై విచారణలు త్వరితగతిన పూర్తి చేసి, తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే కేసుల్లో ప్రధాన శిక్షలు, తక్కువ ప్రాముఖ్యత ఉన్న కేసుల్లో చిన్న శిక్షలు విధించాలని సూచించారు. సస్పెండైన ఉద్యోగులకు జీవన భత్యం అందడం లేదంటూ కొందరు చేసిన ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యోగులందరికీ పనులు సమానంగా కేటాయించాలని సూచించారు. కొంత మంది ఉద్యోగులు ట్రెజరీ సంబంధిత సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొత్తం 28 వినతులు స్వీకరించామని కలెక్టర్ కీర్తి తెలిపారు.

ప్రధాన వినతులివీ..

- రెవెన్యూ సిబ్బంది సమస్యలను ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ సంఘం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కంప్యూటర్, ఎన్నికల నిర్వాహకులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చాలా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని, దూర ప్రాంతాలకు బదిలీ చేయడం వల్ల ప్రయాణ వ్యయాలు పెరిగి వారికి జీవనోపాధి కష్టంగా మారిందని వివరించారు. వీలైనంతవరకు నివాసానికి దగ్గరగా బదిలీ చేయాలని అర్జీ అందజేశారు.
- పరిపాలనా సౌలభ్యం పేరుతో కలెక్టరేట్‌కు దూరంగా ఉన్న కొంతమంది అధికారులను అక్కడ పని చేయాలంటూ ఉత్తర్వులు ఇస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. వీలైనంత వరకూ కలెక్టరేట్‌కు సమీపంలో పని చేస్తున్న అధికారులు కలెక్టరేట్‌లోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చినా, ఇంకా పోస్టింగులు ఇవ్వలేదని, వెంటనే పోస్టింగులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ అసిస్టెంట్ల నుంచి రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లుగా ప్రమోషన్ పొందిన వారికి, కొన్నిచోట్ల తహసీల్దార్ అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారని, అలా కాకుండా సీనియర్లు అయిన డీటీలకే ఆ బాధ్యతలు ఇవ్వాలని కోరారు. ప్రత్యేక దృష్టి పెట్టి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.
- మున్సిపల్, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, విద్య తదితర శాఖల ఉద్యోగులు కూడా కలెక్టర్‌కు తమ సమస్యలు విన్నవించారు.
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా గ్రీవెన్స్ నిర్వహిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.



కలెక్టర్ కీర్తికి అర్జీలు ఇస్తున్న ఉద్యోగులు

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, డ్వామా ప్రాజెక్టు అధికారి నాగమహేశ్వరరావు, సర్వే ఉప సంచాలకుడు బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏఓపై విచారణ సక్రమంగా చేయాలి



డీపీఓ రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక డీఎల్‌పీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటరెడ్డి పలువురు ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తూ వాటిని క్లోజ్ చేయడానికి సదరు ఉద్యోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపై విచారణకు సోషల్ వెల్ఫేర్ జేడీ శోభారాణిని నియమించారు. ఈ విచారణ సక్రమంగా చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కో ఆర్డినేటర్ పి.చెంగల్‌రావు ఆధ్వర్యంలో పలు దళిత గిరిజన సంఘాల నాయకులు డీపీఓ రవికుమార్‌కు ఆయన కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులపై సంబంధం లేని వ్యక్తులతో తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగం ఇప్పించే విషయంలో, బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో మహిళలను కావాలనే తన చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వేట్లపాలెం గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిలో వెంకటరెడ్డి పాత్ర ఉందన్నారు. అతని ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు.

22 నుంచి దసరా సెలవులు

రాయవరం: ఈ నెల 22వ తేదీ నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. తిరిగి పాఠశాలలు అక్టోబరు మూడో తేదీన పునః ప్రారంభం కానున్నాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 24 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. అయితే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రెండు రోజులు ముందుగా ప్రకటించడంతో 22 నుంచి దసరా సెలవులు ఇచ్చినట్లైంది. ఈ సెలవులు మొత్తం 12 రోజులు రావడంతో ఉపాధ్యాయులు సెప్టెంబరు 20న అక్టోబరు 3న విధిగా పాఠశాలలకు హాజరు కావాల్సి ఉంటుంది. 10 రోజులకు మించి 15 రోజుల కన్నా తక్కువ సెలవులు ఉన్న సందర్భంలో తప్పనిసరిగా సెలవులకు ముందు రోజు, పునఃప్రారంభం రోజు విధిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ రెండు రోజుల్లో ఏ ఒక్క రోజు హాజరు కాకున్నా 12 రోజుల సెలవులను హాఫ్ పే లీవ్ లేదా ఈఎల్‌గా పరిగణిస్తారు.

ఇల్లాలి ఆరోగ్యం..
ఇల్లంతా ఆనందం..

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్యక్రమం
- జిల్లాలో 556 వైద్య శిబిరాల నిర్వహణ



వైద్య శిబిరంలో భాగంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

రాయవరం: ఇంటా బయట పని ఒత్తిడితో మహిళలు పోషకాహారం లోపం, రక్తహీనతకు గురవుతున్నారు. తద్వారా పలు అనారోగ్యాలపాలవుతున్నారు. వారే మూలన పడితే కుటుంబ ఆరోగ్యం మందగిస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్‌ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

దేశ వ్యాప్తంగా ఇలా..

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహిళలకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన, వైద్య సేవలు అందించడం చేస్తున్నారు.

పరీక్షలు ఇవీ..

ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు నెలల నుంచి 60 ఏళ్ల మహిళల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఆ పై వయసున్న వారికి ఎన్‌సీడీ పరీక్షలు చేస్తారు. మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, టీబీ, ఈఎన్‌టీ, నేత్ర, బీపీ, చక్కెర, దంత పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స అందిస్తారు. గర్భిణులకు పరీక్షలు చేసి పోషకాహారం ఆవశ్యకతను తెలియజేస్తారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను అందించనున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డుల పంపిణీ, ఇతర వ్యాధులపై అవగాహన కలిగించేలా ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లా పరిధిలోని 22 మండలాల్లో 556 వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి భరోసా లభిస్తుంది. తద్వారా సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలి. వైద్య శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

– డాక్టర్ సుమలత, జిల్లా నోడల్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

శ్రీపీఠంలో 22 నుంచి మహాశక్తి యాగం

- వంద కోట్ల కుంకుమార్చనలకు ఏర్పాట్లు
- దసరా వరకు వేడుకలు, ప్రత్యేక పూజలు
- వెయ్యి కోట్ల సంకల్పంతో మహా క్రతువు
- శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి



శ్రీపీఠంలో విలేకరులతో మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాలలో భాగంగా మండలం రమణ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం – 2025ను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పరిపూర్ణానంద స్వామిజీ తెలియజేశారు. పీఠంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 నుంచి ప్రారంభించిన మహాశక్తి యాగాన్ని మూడో ఏడాదీ కొనసాగిస్తున్నామని, ఈసారి వంద కోట్ల కుంకుమార్చనలను నిర్వహించనున్నామని తెలిపారు. తమ మాతృమూర్తి సంకల్పంతో పదేళ్ల పాటు మహాశక్తి యాగం ద్వారా వెయ్యి కోట్లు కుంకుమార్చనలకు లలితా సహస్ర నామార్చనలతో చేపడతామన్నారు. ఈ సంవత్సరం రెండు నెలల ముందు నుంచే రిజిస్ట్రేషన్లను ప్రారంభించామని సుమారు 36 వేల మంది మహిళలు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. వీరే కాకుండా మరో ఆరు వేల మందితో రోజూ 40 వేల మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. నవరాత్రుల్లో ఏడు రోజుల్లో వంద కోట్ల కుంకుమార్చనలు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. సుమారు 4 నుంచి 5 లక్షలు మంది భక్తులకు అన్న ప్రసాదం తయారు చేస్తున్నామన్నారు. నిత్యం ఉదయం 6 గంటలకు యాగాలు, పూజలు ప్రారంభమవుతాయన్నారు. సహస్ర చండీయాగం, సహస్ర రుద్ర హోమం, ఆరు లక్షల బగళాముఖి హోమం, వారాహి హోమం, ప్రత్యంగిరా హోమం, వటుక భైరవ హోమం నిర్వహిస్తామన్నారు. నిత్యం ఒక్కో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని, సెప్టెంబరు 29న సామూహిక సరస్వతి పూజ, అక్టోబరు 2న మహాపూర్ణాహుతి ఉంటుందని, 3న అమ్మవారు వెంకటేశ్వరస్వామిగా దర్శనమిస్తారన్నారు. యాగానికి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న మహిళలకు తన మాతృమూర్తి సొమ్ములతో రాగి కంకణం అందజేస్తామన్నారు. మహా ప్రసాదం వద్ద 65 కౌంటర్లతో పాటు వెయ్యి మంది సేవకులతో కేవలం రెండు గంటలోనే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాగాలు, ఇతర పూజల నిమిత్తం మన ప్రాంతంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 120 మంది రుత్వికులు హాజరవుతున్నారన్నారు. నిత్యం సాయంత్రం ఎనిమిది శక్తులకు సంబంధించి అమ్మవారి అర్చనలు చేస్తామన్నారు. ధాన్యపు అంకురాలతో అన్నపూర్ణ అమ్మవారికి అర్చన చేసి ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుతామన్నారు. పసుపు కొమ్ములు, లక్ష కొబ్బరి కాయలు,.. తొమ్మిది అర్చనలు చేస్తామన్నారు.

వంద కోట్లు లలితా నామ పారాయణం ఇలా... ఒక మనిషి ఒక్క సారి పారాయణం చేస్తే వెయ్యి అవుతుందని, ఆ లెక్కన 30 వేల మంది పారాయణం చేస్తే మూడు కోట్లు అవుతాయని, రోజుకు నాలుగు పారాయణాలు చేస్తే 12 కోట్ల పారాయణం అవుతుందని స్వామిజీ తెలిపారు. ఆ విధంగా తొమ్మిది రోజుల్లో వంద కోట్లు లలితా కుంకుమార్చనలు పూర్తి చేస్తామన్నారు. ఈ సారి ఏడు రోజులకే పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

వీఆర్‌ఏల పోరుబాట

- కనీస వేతనాలు, పదోన్నతులపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- నేడు డివిజన్ కార్యాలయాలు.. 22న కలెక్టరేట్ వద్ద ధర్నాలు

రాయవరం: రెవెన్యూ వ్యవస్థలో అత్యంత కీలకంగా పనిచేసే గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పోరాట బాట పట్టారు. మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమాలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. మండల కేంద్రాల్లో ఈ నెల 18 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టగా, శుక్రవారం డివిజన్ కేంద్రాల్లో, 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు వీఆర్‌ఏలు ఆందోళన చేస్తున్నారు.

డిమాండ్లు ఇవీ

వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని కోరుతూ వారు ఆందోళనబాట పట్టారు. గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఎ)కు ప్రస్తుతం రూ.11 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. రాష్ట్రంలో కనీస పేస్కేలు రూ.21 వేలు వున్నప్పటికీ గ్రామ స్థాయిలో కీలకంగా పనిచేసే వీఆర్‌ఏలకు మాత్రం నెలకు రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా నారా చంద్రబాబునాయుడు వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలు, అటెండర్లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరుతున్నారు. జిల్లా పరిధిలోని 22 మండల తహసీల్దారు కార్యాలయాల్లో పనిచేస్తున్న 700 మంది వీఆర్‌ఏలు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు.



ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

డిమాండ్లు నెరవేర్చాలి



గ్రామ స్థాయిలో పనిచేసే వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలి. కనీస వేతనం అమలు చేయాలి. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కనీస వేతన స్కేలు రూ.21 వేలుగా ప్రకటించాలి.

– ఖండవిల్లి రవిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, వీఆర్‌ఏ అసోసియేషన్, అమలాపురం


క్రమబద్ధీకరించాలి



నామినీలుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలి. కనీస వేతనం అమలు చేయక పోవడం వలన కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఉంది. నిత్యం రెవెన్యూ సేవల్లో ఉంటున్న వీఆర్‌ఏలకు కనీస వేతనం చెల్లించాలి.

– చంద్రమళ్ల దుర్గారావు, అధ్యక్షుడు, మండల వీఆర్‌ఏ అసోసియేషన్, రాయవరం

రామలింగేశ్వరునిపై అరుణ కిరణాలు



పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన పంచాయతన సమేత శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారు శుక్రవారం అరుణ కిరణాలు స్పృశిస్తుండగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు మాట్లాడుతూ ఏటా దక్షిణాయన, ఉత్తరాయణ పుణ్య కాలాల్లో ఒకొక్కసారి చొప్పున రెండు సార్లు స్వామివారిపై సూర్య కిరణాలు పడతాయని తెలిపారు. సూర్యాస్తమయ కిరణ స్పర్శతో స్వామివారు ప్రకాశవంతంగా దర్శనమివ్వడంతో భక్తులు తన్మయత్వం చెందారు.

టీటీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి టీటీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుతో పీడీ, ఇతర ఉపాధ్యాయులు

పెదపూడి: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు బాలురు, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు నిర్వాహక కార్యదర్శి పడాల గంగాధర్ రెడ్డి తెలిపారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్జీఎఫ్ అండర్ 19 టీటీ ఎంపికలు శుక్రవారం జరిగాయి. బాలురు, బాలికల విభాగాల్లో 48 మంది హాజరు కాగా వారిలో బాల, బాలికలను ఐదుగురి చొప్పున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున వారు పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల హెచ్‌ఎం అప్పలాచారి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

కార్యక్రమంలో పాఠశాల పీడీ నల్లమిల్లి అప్పారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు గొలుగూరి గౌరీ శంకర్ రెడ్డి, ద్వారంపూడి యువరాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలుగా స్కూల్ అసిస్టెంట్లు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎంఈఓ–1గా స్కూల్ అసిస్టెంట్లను నియమించవద్దంటూ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవూరి రవి పేర్కొన్నారు. కాకినాడలో శుక్రవారం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ మండల, డివిజన్ విద్యాశాఖాధికారులను నియమించేటప్పుడు సీనియారిటీ ప్రాతిపదికన తీసుకోవాలని, కేవలం నోటిమాట ద్వారా ఉత్తర్వులు జారీ చేస్తున్నారన్నారు. స్కూల్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి అధికారులుగా నియమిస్తే విద్యా బోధన కుంటుపడుతుందని, ఇప్పటికే ఇన్‌చార్జిలుగా నియమించిన వారిని తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి కుర్మారావు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు సీవీవీ సత్యనారాయణ, పుల్లయ్య, సాయిమోహన్, మురళీభాస్కర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వైనాట్‌లో జీఎస్టీ తగ్గింపు ధరలు

22 నుంచి అమలు

తణుకు అర్బన్: ఎలక్ట్రానిక్ పరికరాలపై జీఎస్టీ నూతన విధానం ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తుండడంతో వైనాట్ షోరూంలలో ఎలక్ట్రానిక్ సామగ్రిని తగ్గింపు ధరలకు విక్రయించనున్నట్లు వైనాట్ అధినేత జుజ్జువరపు వెంకటరాయుడు తెలిపారు. తణుకు వైనాట్ షోరూంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తగ్గింపు ధరలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎల్‌ఈడీ టీవీలు, ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషర్, ఇన్వర్టర్ బ్యాటరీలపై 28 నుంచి 18 శాతానికి జీఎస్టీని తగ్గించినట్టు చెప్పారు. ఈ నెల 22న దసరా శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా వైనాట్ షోరూంలో ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నామని, దీంతో మరింత తక్కువ ధరకే వస్తువులు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. రూ.10 వేలకు పైబడి కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికి లక్కీ డిప్ ద్వారా కచ్చితమైన బహుమతి లభిస్తుందని వివరించారు. ఈ శుభ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తగ్గింపు ధరల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైనాట్ యాజమాన్యం

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

రౌతులపూడి: రౌతులపూడి గ్రామానికి చెందిన ఇటంశెట్టి వెంకట సత్యనారాయణ (40) గడ్డి మందు తాగి గురువారం అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం పదిగంటల సమయంలో ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు.

దీంతో అపస్మారక స్థితిలో పడిపోయిన అతడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గత అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై అన్నారు.

జేసీ గోపాలకృష్ణ వ్యాఖ్యలు విచారకరం



విప్పర్తి నిఖిల్ కృష్ణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడిన తీరును ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక (ఏపీ వీడబ్ల్యూఎస్‌ఈ జేఏసీ) రాష్ట్ర కమిటీ చైర్మన్ షేక్ మొహమ్మద్ జానీపాషా, ప్రధాన కార్యదర్శి విప్పర్తి నిఖిల్ కృష్ణ, కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. ఈ మేరకు నిఖిల్ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారన్నారు. అటువంటి వ్యవస్థను ఇంత తక్కువగా చూడటం, కేవలం సర్వేలు చేయడానికే ఉన్నారన్నట్టు ప్రవర్తించడం, ఉద్యోగులందరినీ అవమానించేటట్టుగా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇతర గ్రామ, వార్డు శాఖల సిబ్బంది అందరూ కలసికట్టుగా ఆరేళ్లుగా విశేషంగా పని చేస్తున్నారన్నారు. అయితే 'ఒకే శాఖ ఉద్యోగులే పని చేస్తున్నారు – మిగతా వాళ్లకు పనిలేదు' అన్న విధంగా ఏకవచనంలో మాట్లాడటం, మాట్లాడిన భాష సరిగా లేకపోవడం, ఇతర సిబ్బందిని అవమానపరచడం అంగీకారయోగ్యం కాదన్నారు. రాష్ట్రం మొత్తానికి ఒకే విధానం ఉంటే, ఒక జిల్లాకు వేరే నియమాలు ఉండకూడదన్నారు. ఇటువంటి ఘటనలపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఐక్యవేదిక కోరుతోందన్నారు. ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి, ఉద్యోగుల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం మన జేఏసీ తరపున గట్టిగా నిలబడతామని పేర్కొన్నారు.

ఆసియా ఫెన్సింగ్ పోటీలకు కాకినాడ క్రీడాకారులు



యూకేలో జరిగే అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యూకేలో ఈనెల 19 నుంచి 22 వరకు జరుగుతున్న ఏషియన్ కేడేట్ అండర్–17 ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని ఫెన్సింగ్ సంఘ అధ్యక్షురాలు నల్లమిల్లి సుగుణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలలో జిల్లా కు చెందిన పి.చిన్మయి శ్రేయ, పి.లిఖిత రెడ్డి, నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డిలు ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఫెన్సింగ్ మెంటార్ నాగం సతీష్ బాబు మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 34 మంది కోచ్‌లు అందుబాటులో ఉన్నారన్నారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్‌లు కృష్ణమోహన్, లక్ష్మణ్, రామృష్ణ, రాజు, రెడ్డిలను ఫెన్సింగ్ సంఘ అధ్యక్షురాలు సుగుణారెడ్డి, శాప్ చైర్మన్ ఏ.రవినాయుడు తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

రాజోలు: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు శివకోటి ఉన్నత పాఠశాల క్రీడాకారులు ముగ్గురు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎస్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో పైడిమర్రి ఇంద్రజ, అండర్–14 విభాగంలో బాలం ప్రణతి, వీరమల్లు చిరుతేజ ఎంపికయ్యారు. సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

ఏఎన్‌ఎంపై దాడి : అట్రాసిటీ కేసు నమోదు

మలికిపురం: మండలం పడమటిపాలెం పంచాయతీలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న కందికట్ల రత్నకుమారిపై దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన రేకపల్లి దొరబాబు, అడబాల వెంకట నాగ సత్యవతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పీవీవీఎస్ సురేష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గురువారం పడమటిపాలెం పంచాయతీ వద్ద విధి నిర్వహణలో ఉన్న రత్నకుమారి వద్దకు అడబాల లక్ష్మీ దీపిక అనే మహిళ ఇంజక్షన్ కోసం వచ్చింది. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని దీపిక వారింటిలోని బంధువులకు చెప్పింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు వచ్చి రత్నకుమారిపై దాడికి పాల్పడి, కులం పేరుతో దూషించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై దాడి, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వెండి నాగాభరణం సమర్పణ



కాశీ విశ్వేశ్వర స్వామికి వెండి నాగాభరణం సమర్పిస్తున్న భక్తురాలు

దేవరపల్లి: మండలంలోని కురుకూరులో వేంచేసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర సామి వారికి గ్రామానికి చెందిన కొయ్యలమూడి శ్రీరామచంద్రరావు, సుందర మాణిక్య వాణి దంపతుల కుమార్తె, అల్లుడు పిన్నమనేని శ్రీధర్ సునీత దంపతులు (ఎన్నారై) సుమారు రూ.3.50 లక్షల విలువ గల వెండి నాగాభరణాన్ని సమర్పించారు. తొలుత పూజలు నిర్వహించి ఆలయ ప్రధాన అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి సంతోష్ శర్మ, వేదపండితులు పుల్లేటికుర్తి శ్రీకాంత్ శివాచార్య, కొత్తలంక భగవాన్ శర్మ, సొసైటీ అధ్యక్షులు యలమాటి భాస్కరరావు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దేవంలో నీటి నమూనాల సేకరణ



పెద్దేవంలో నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

తాళ్లపూడి: కొద్ది రోజులుగా పాడి గేదెలు మృతి చెందుతున్న పెద్దేవం గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గేదెల వరుస మరణాల దృష్ట్యా గ్రామానికి వచ్చిన కలెక్టర్ గేదెలు తాగుతున్న నీటిని పరీక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆ శాఖ ఈఈ బీవీ గిరి, డీఈ ఎం.పార్వతి, ఏఈ షేక్ సూర్జహాన్ నీటి నమూనాలు సేకరించారు. వారితో పాటు గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ కూడా ఉన్నారు.

ఉత్సాహంగా స్కూల్స్ గేమ్స్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చాంపియన్ షిప్ క్రీడా పోటీలు, ఎంపికల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో అండర్ – 14, అండర్ – 17 బాల బాలికల బాక్సింగ్, ఊషు క్రీడా పోటీలు, ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్‌లో సుమారు 450 మంది క్రీడాకారులు వివిధ క్రీడా అంశాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆయా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు త్వరలో జరిగే అంతర జిల్లాల పాఠశాల క్రీడా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీ వెంకట రాజు, దిలీప్ కుమార్, ఏవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా జైలు సందర్శన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక కేంద్ర కారాగారంలోని మహిళా జైలును హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ ఎస్.విజయభారతి శుక్రవారం సందర్శించారు. కారాగారంలో ఖైదీలతో మాట్లాడారు. అందులోని వంటశాల, ఆసుపత్రి, బేకరీ, ఖైదీల బ్యారక్, పిల్లల క్రచ్, ఆర్‌వో ప్లాంట్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కారాగారంలోని ఖైదీల నైపుణ్యాలను బయటకు తీసుకురావడానికి జైలు అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంతకుమారి, ఇందిరారాయ్, పి.పావని, కె. సుభాషిణి పాల్గొన్నారు.